ప్రజాశక్తి
బుధవారం 1 అక్టోబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

నేటి నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీల బంద్

- అదనపు సీనరేజీ వసూలుపై మండిపాటు
- మైనింగ్ బిల్లులు కట్టరాదని యజమానుల తీర్మానం
- ముడిరాయి కొనుగోలు చేయరాదని నిర్ణయం

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రానైట్ ఫ్యాక్టరీల యాజమానులు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలోనే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా గ్రానైట్ యూనిట్లపై సీనరేజీ పెంపు, వసూలును ఎఎంఆర్ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీంతో యూనిట్ల యజమానులు బుధవారం నుంచి ఫ్యాక్టరీల బంద్‌కు పిలుపునిచ్చారు. రామతీర్థంలోని విటిసి సెంటర్లో చీమకుర్తి, ఆర్ఎల్‌పురం, బుదవాడ, ఏలూరు రోడ్డు ఏరియాలలోని గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ యజమానుల సంఘాల సంయుక్త సమావేశం ఈ మేరకు మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అక్టోబర్ 1 నుంచి గ్రానైట్ పరిశ్రమలపై సీనరేజ్ వసూలును ఎఎంఆర్ సంస్థకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చీమకుర్తి ప్రాంతం నుంచి ఎగుమతి అయ్యే ప్రతి ఖనిజంపై సీనరేజీ వసూలు హక్కు ఎఎంఆర్ సంస్థకు ఉంటుంది. పాలిసింగ్ యూనిట్ల యజమానులు స్లాబ్ సిస్టం కింద ఒక్క కట్టర్‌కు రూ.27 వేలు ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. అక్టోబరు నుంచి అదనంగా రూ.8 వేలు చెల్లించాలని ▶ 2లో

లంక గ్రామాలను చుట్టు ముట్టిన వరద నీరు

▶ 7లో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి

▶ 6లో

జిఎస్‌టి ఫలాలపై ప్రచారమా..?

- ఇప్పటి వరకూ జనాన్ని బాదిందెవరు ?
- కొత్త శ్లాబులు అందినప్పుడే
- నిత్యావసరాల ధరల్లో కనిపించని తేడా

పిసిపల్లిలో జిఎస్‌టి ఫలాలపై ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఏ వస్తువు కొన్నా 12 నుంచి 18 ఆతర్వాత 28శాతం జిఎస్‌టి వసూలు చేసి జనాన్ని ఇప్పటి వరకూ గుల్లచేసిందెవరు?కేంద్రం కాదా? అందుకు రాష్ట్రం సహకరించలేదా? ఇడ్లీ తిన్నా జిఎస్‌టి వేశారే? ఏ వస్తువును వదిలిపెట్టలేదు. ఇపుడు జనంలో దీనిపై తీవ్ర వ్యతిరేకతతోపాటు వస్తువుల మార్కెట్‌లోనూ కంపెనీల వత్తిళ్లు పెరిగాయి. తయారైన వస్తువులు కుప్పలుకుప్పలుగా పేరుకుపోతున్నాయి.దీంతో కేంద్రం అనివార్యంగా జిఎస్‌టి శ్లాబులను మార్చింది. ఈనెల 22 నుంచి 5శాతం, 12 నుంచి 18 కొన్ని.. ఆ తర్వాత 40 శాతంలో కొన్ని వస్తువులను చేర్చింది.అయితే ఎక్కువ వస్తువుల ధరలు తగ్గుతాయనే ప్రచారం తెరపైకి తెచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలను పండుగలా చేసుకోవాలని కేంద్రం ఆదేశించింది. జిల్లా అధికారులూ అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. జిఎస్‌టి పండుగ అంటూ ప్రచార కార్యక్రమాలు సాగుతున్నాయి.వాస్తవానికి జనం రోజువారీగా వినియోగించే వస్తువుల ధరలు తగ్గలేదు. జిఎస్‌టి సర్దుబాటు జరిగినా ధరల్లో పెద్దగా మార్పులు కనిపించడం లేదు. నిత్యావసరాల ధరలు తగ్గలేదు. కూరగాయల ధరలు తగ్గలేదు. పాలుపెరుగు వంటి వాటి ధరల్లోనూ ఏమార్పు లేదు. టీవీలు, ఎసిలు, ఫ్రిజ్‌లు భారీ ధరలు ఉండే ఎలక్ట్రానిక్స్ వస్తువుల ధరపై జిఎస్‌టి తగ్గింపు ప్రభావం కనిపిస్తోంది. కార్ల ధరలపైనా జిఎస్‌టి తగ్గుదల ప్రభావం ఉంటుందని భావించారు.అయితే కార్ల కంపెనీలు పెద్దగా ఇవ్వడం లేదు. కార్ల ధరలు పెంచారు. గతంలో ఉన్న ఆఫర్లు లేవంటూ అదే ధరలు చెబుతున్నారు. గతానికి ఇప్పటికీ పెద్దగా ధరలో తేడాల్లేవంటున్నారు.సర్దుబాటు చేస్తున్నారు. స్వల్పంగా తగ్గుదల చూపిస్తున్నారు. సామాన్యుడిపై మొన్నటి వరకూ అన్ని రకాలుగా జిఎస్‌టి పేరుతో బాదేశారు. ఇపుడు వాటి ఫలాలు పొందాలని చెబుతున్నారు. మార్కెట్‌లోకి వెళితే ఏది కొన్నా జిఎస్‌టి ప్రభావం కనిపించడం లేదు. పేదలు రోజూ మద్యం కోసం ఎంత ఖర్చుచేస్తున్నారు. దానిపై జిఎస్‌టి తగ్గించారా?అనేది ఆలోచించాలి. నెలకు జిల్లాలో మద్యం ద్వారా రూ.120 కోట్ల వ్యాపారం సాగుతోంది. దీనిపై జిఎస్‌టి ఏ మేరకు తగ్గించారో ప్రభుత్వం ప్రకటించాలి. రెస్టారెంట్లలో ఫుడ్స్‌పై ఎలాంటి మార్పులేదు. ధరలు ఏమాత్రం తగ్గలేదు. పాత ధరలే అమ్ముతున్నారు. హోటళ్లలోనూ ఇదే పరిస్థితి.మాల్స్‌లో ఎక్కడా జిఎస్‌టి వల్ల పలానా వస్తువు ధర తగ్గిందనే బోర్డులే కనిపించడం లేదు.బియ్యం గతంలో ఉన్న ధరే ఇపుడూ అమ్ముతున్నారు. రవాణా ఛార్జీల్లో మార్పుల్లేవు. పిల్లలు తినే బిస్కెట్ల ప్యాకెట్లు కూడా అదే ధరతో ఉన్నాయి. పుస్తకాల ధరలపై 12శాతం జిఎస్‌టి ఉంది. రెడిమేడ్ దుస్తులపైనా 18శాతం పెంచారు. కార్ల ధరలను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. పెట్రోలు, డీజిల్ ధరల్లో మార్పులేదు. దీని వల్ల రవాణా రంగంపై దీని ప్రభావం కనిపించడం లేదు.ఎక్కువ మంది వినియోగించే వస్తువులపై పన్నులు తగ్గలేదు. తక్కువ మంది వాడే వస్తువుల ధరలు తగ్గించేయత్నం చేశారు. జిఎస్‌టి వల్ల ఏఏ వస్తువుల ధరలు తగ్గాయనేదీ ప్రభుత్వమే జాబితా ఇవ్వాలి.

పొగాకు కొనే దారేదీ..?

- ముగిసిన బర్లీ కొనుగోళ్లు
- మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది 13 వేల టన్నులు మాత్రమే
- ప్రైవేటు కంపెనీలు 20 వేల టన్నులు
- రైతుల వద్ద 40 వేల మెట్రిక్ టన్నులు

రైతుల ఇళ్ల వద్ద నిల్వ ఉంచిన నల్లబర్లీ పొగాకు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు చివరి ఆకు వరకూ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్రప్రభుత్వం దాన్ని నెరవేర్చలేకపోయింది. రైతుల వద్ద నిల్వ ఉన్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు లక్ష్యాన్ని 13,600 టన్నులకు పరిమితం చేసింది. చివరకు గోదాములు అందుబాటులో లేక 13 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకే పరిమితమైంది.ప్రభుత్వం తాను కొనలేక పోయినా ప్రైవేట్ కంపెనీల చేత కూడా పొగాకును కొనిపించలేకపోయింది. దీంతో రైతుల వద్ద సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల మేర నల్లబర్లీ నిల్వలు ఉన్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.పొగాకు కొనేవారు లేక పొలంలో, ఇంట్లో, ఇంటి ముందు నిల్వ ఉన్న నల్లబర్లీ పొగాకు మండెలు రైతులను నిద్రకు దూరం చేస్తున్నాయి. బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల్లో ఆత్మస్థైర్యం సన్నగిల్లుతోంది . గత వ్యవసాయ సీజన్‌లో నల్ల బర్లీ పొగాకుకు ధర బాగా ఉండటంతో ఈ ఏడాది రైతులు విస్తారంగా బర్లీ పొగాకును సాగు చేశారు. జిల్లాలో సాధారణ పొగాకు సాగు విస్తీర్ణం 17 వేల ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 70 వేల ఎకరాల్లో నల్లబర్లీ పొగాకు సాగు చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకు కొనుగోళ్ళు మందగించాయంటూ నల్లబర్లీ పొగాకును కొనేందుకు ప్రైవేట్ కంపెనీలు ముందుకు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వమే మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోళు చేపట్టింది. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రెండు పర్యాయాలు పొగాకు కొనుగోలు పర్యవేక్షణ కోసం జిల్లాకు వచ్చారు. రైతుల వద్ద మిగిలి ఉన్న బర్లీ పొగాకు ▶ 2లో

అమెరికా ఉన్మాదాన్ని ఎదిరించాలి

సిఐటియు సీనియర్ నాయకులు పూనాటి ఆంజనేయులు

మాట్లాడుతున్న పూనాటి ఆంజనేయులు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెకేందుకు అమెరికా సాగిస్తున్న యుద్ధ, వాణిజ్య ఉన్మాదాన్ని ఎదిరించడానికి అభివృద్ధి చెందిన దేశాల మద్దతు కూడగట్టాల్సి ఉందని సిఐటియు సీనియర్ నాయకులు పూనాటి ఆంజనేయులు తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో అమెరికా విధించిన ఎగుమతి సుంకాలు - భారతదేశంలో వర్తక వాణిజ్య వర్గాలు, వ్యవసాయం పై దాని ప్రభావం- ప్రత్యామ్నాయ మార్గాలుఅనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఒంగోలు నగర అబివృద్దిద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచంలో అగ్రరాజ్యాంగా విస్తరించిన అమెరికా ఆధిపత్యం కొనసాగాలని ఆదేశ అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న వాణిజ్య పరమైన ఆంక్షలు భారత పౌరులపై తీవ్రప్రభావం చూపుతున్నట్లు తెలిపారు. ప్రపంచీకరణను ప్రవేశపెట్టిన అగ్రరాజ్యమే ప్రపంచీకరణను విస్మరించడం పట్ల అమెరికన్లు సైతం తీవ్ర అసంతప్తితో ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచీకరణ కట్టు బాట్లను విస్మరించిన ట్రంప్ అరాచకాలను సష్టిస్తున్నట్లు విమర్శించారు. ట్రంప్ ఆంక్షలలో హెచ్ 1బి వీసాలకు 1,500 (రూ 1.20లక్షలు) డాలర్లు ఫీజు ఏకంగా 65 శాతం లక్ష డాలర్లు (రూ.88లక్షలు)పెంచడం వంటి చర్యల వల్ల అమెరికాలో నివసిస్తున్న 4 నుంచి 5లక్షలు మంది భారత పౌరులపై తీవ్ర ప్రభావం చూపు తుందన్నారు. హెచ్1బి ప్రతి ఏటా అమెరికా అనుమతిస్తున్న 89 మంది భారతీయులలకు ఈ ఏడాది ▶ 2లో

పీఠాన్ని అధిష్టించేదెన్నడో?

మార్కాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ కోసం 'కుర్చీ' ఎదురు చూపు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో ఏమి జరుగుతోందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయ మార్పులు చోటు చేసుకున్నాయి. కొందరు కౌన్సిలర్లు అటుఇటుగా మారిపోయారు. మార్పులు, చేర్పులతో కూటమి బలం పెరగడంతో వైసిపి ఆధీనంలోని 'మార్కా'పుర' పీఠం వదులుకోవాల్సి వచ్చింది. ఖాళీగా ఉన్న 'పీఠం'పై అధికార పార్టీ నుంచి వక్కలగడ్డ రమ్యస్వాతిని కూర్చోబెడతామని అధికార పార్టీ చెబుతోంది. పదవీ కాలం కరిగిపోతున్నా... ఇప్పటి వరకు అతీగతీ లేదు!

'పీఠం' ఎదురుచూపు

రాష్ట్రంలో అధికారంలోకి ఎన్‌డిఎ కూటమి రాగానే ఇక్కడి రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. వైసిపి ఆధీనంలో 30 మంది కౌన్సిలర్లు ఉండగా.. అందులో ఏకంగా 12 మంది తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మరో ఏడుగురు కౌన్సిలర్లు పరోక్షంగా మద్దతుగా నిలిచారు. టిడిపి కౌన్సిలర్లు ఐదుగురితో కలుపుకుని అధికార కూటమికి 24 మంది కౌన్సిలర్ల బలం చేకూరింది. వైసిపికి చెందిన మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ క్రిష్ణను ఆ పదవి నుంచి తప్పించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. జూన్ 11వ తేదీన అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ చిర్లంచెర్ల పదవిని కోల్పోయారు. అప్పటి నుంచి మున్సిపల్ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. ఆ పదవి రేసులో ఆది నుంచి టిడిపికి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ వక్కలగడ్డ రమ్యస్వాతి ఉన్నారు. అవిశ్వాసం నెగ్గి మూడున్నర మాసాలు దాటింది. కౌన్సిల్ పదవీ కాలం మరో ఆరు మాసాలు మాత్రమే ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలూ సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకవేళ నోటిఫికేషన్ వెలువడితే ఇక చైర్మన్ ఎన్నిక నిర్వహించడం కష్టమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వైసిపికి చెందిన చైర్మన్ చిర్లంచెర్లను పదవి నుంచి తొలగించడంలో అధికార పార్టీ నేతలు చూపిన శ్రద్ధ అధికార పార్టీకి చెందిన రమ్యస్వాతిని ఆ పీఠంపై ఎక్కించడంలో అదే ఉత్సాహం అధికార పార్టీ నేతలు చూపలేకపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ తలచుకుంటే జరగని పని అంటూ ఏదీ లేదనేది అందరికీ తెలుసు. ఇక్కడి అధికార పార్టీలో ఏమి జరుగుతోందో అంతుబట్టడం లేదు. రమ్యస్వాతి మార్కా'పుర' పీఠం ఎక్కేదెన్నడు? అనేది మాత్రం సందేహంగా మిగిలింది!

వక్కలగడ్డ రమ్యస్వాతి

అమెరికా ఉన్మాదాన్ని ఎదిరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎస్ పూర్తి గావించిన విద్యార్థులకుతీవ్ర శరాఘాతమన్నారు. నుంచి ఆయిల్, ఆయుధాల దిగుమతులపై ఆంక్షలు విధించిన కారణంగా ఆయిల్ దిగుమతిపై ఏటా రూ.లక్ష కోట్లు నష్టం వాటిల్లుతుందన్నారు. ఆయిల్, ఆయుధాలు తమ వద్ద కొనుగోలు చేయాలని, పత్తి, మొక్కజొన్న,పాలు, బాదం, మాంసం, వంటి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు అనుమతించాలని, లేని పక్షంలో అమెరికా ఎగుమతులపై 25 నుంచి 100శాతం టారిఫ్‌లు చెల్లించాలని, అక్టోబర్ 1నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2024లో 79 బిలియన్ డాలర్ల ఉత్పత్తులు ఎగుమతి చేయగా, 41 బిలియన్ డాలర్ల ఉత్పత్తులు దిగుమతులు చేసినట్లు వివరించారు. 38 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు భర్తీ చేసుకునే ప్రక్రియలో భాగంగా వాణిజ్య ప్రపంచీకరణ ఒప్పందాలకు తిలోదాకాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అమెరికా విధించిన టారిఫ్ ఆంక్షలతో ఏటా 10 బిలియన్ డాలర్ల ఫార్మా ఉత్పత్తులు, 1510 బిలియన్ డాలర్ల స్మార్ట్ ఫోన్లు, 5 బిలియన్ డాలర్ల రొయ్యలు, చేపలు, మరో 5 బిలియన్ డాలర్ల ఆభరణాలు, వజ్రాలు ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఉత్పత్తులు నిలిచిపోయి నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టారిఫ్ ఆంక్షలను జాతీయ సమస్యగా పరిగనించి, ట్రంప్ ఎత్తులను చిత్తుచేసేందుకు మోడీ ప్రభుత్వం పొరుగు దేశాలతో వాణిజ్యపరమైన ఒప్పందాలు కొనసాగించాలన్నారు. వర్ధమాన దేశాల ఐక్యతను కూడగట్టి ఆమెరికా ఆధిపత్యాన్ని ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. విశ్రాంత ఎఎస్‌పి సుంకర సాయిబాబా మాట్లాడుతూ ఆర్థిక ఆంక్షల పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డెంపూడి సుజాతరావు మాట్లాడుతూ ట్రంప్ చర్యల పట్ల మోడీ మౌనం వహించడం తగదన్నారు. నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో కమిటీ ప్రధాన కార్యదర్శి టి. భక్తసింగ్ రాజు, కోశాధికారి బి.ముసలా రెడ్డి, సిఐటియు నాయకుడు జి.రమేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేవతు శ్రీరాములు, హేతువాద సంఘ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య, ఎ. లక్ష్మినారాయణ, డి.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త శుద్ధీకరణ యంత్రాన్ని ప్రారంభించిన చైర్మన్, కమిషనర్

బయో మైనింగ్ చెత్త శుద్ధీకరణ యంత్రం ఏర్పాటు

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలో చెత్త సమస్యకు మార్గం సుగమమైంది. పట్టణంలోని కొండపేట రోడ్డులోని పాత డంపింగ్ యార్డులో బయో మైనింగ్ చెత్త శుద్ధీకరణ యంత్రాన్ని మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని కొండపేట రోడ్డులోని పాత డంపింగ్ యార్డులోని చెత్త నిల్వాలలతో పరిసరాలు పూర్తి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఈ సమస్యకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చొరవతో చూపడంతో బయో మైనింగ్ చెత్త శుద్ధీకరణ యంత్రం ఏర్పాటు గిద్దలూరుకు వచ్చినట్లు తెలిపారు. తద్వారా పట్టణంలోని నివాస గృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల నుంచి నిత్యం పోగయ్యే చెత్త నుంచి బయో మైనింగ్ ద్వారా ప్లాస్టిక్ వేస్ట్, మెటల్ వేస్ట్, గాజుగా విభజించి మిగిలిన ఆర్గానిక్ వ్యర్థాన్ని ప్రాసెస్ చేసి కంపోస్ట్‌గా మార్చి వ్యవసాయానికి అందుబాటులోకి తెస్తున్నారని, ఈ ప్రక్రియ ద్వారా డంపింగ్ యార్డు ద్వారా వచ్చే లీచిట్ వల్ల జల కాలుష్యం, మిథేన్ వంటి హానికర ఉద్గారాలను నియంత్రణ చేయవచ్చని, అలాగే డంపింగ్ యార్డ్ మండటం వల్ల వచ్చే హానికర విష వాయువులను అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని, ఈగలు, దోమల ద్వారా వచ్చే అంటు వ్యాధులను కూడా నివారించవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి

గ్రానైట్ ఫ్యాక్టరీల బంద్

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేశారు. అసలే నష్టాలతో నడుస్తున్న ఫ్యాక్టరీ యజమానులు ఈ అదనపు ప్రతిపాదనలను తిరస్కరించారు. విటిసిలో నిర్వహించిన ఫ్యాక్టరీ యజమానుల సమావేశంలో యజమానులు తమ బాధలను వెళ్లబుచ్చారు. ఈ సందర్భంగా సమావేశం పలు తీర్మానాలు ఆమోదించింది. అక్టోబర్ 1 నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలు పూర్తిగా బంద్ చేయాలని, ప్రభుత్వానికి మైనింగ్ బిల్లులు చెల్లించరాదని, క్వారీల నుంచి ముడి రాయి కొనుగోలు చేయరాదనే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆయా ఫ్యాక్టరీల యజమానులు తీర్మానాలను కచ్చితంగా పాటించాలని, తీర్మాన వివరాలను ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. చిన్న తరహా పరిశ్రమలను ఆదుకోవాల్సిన సమయంలో భారాలను మోపవద్దని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి ఏరియా ఫ్యాక్టరీ యజమానుల సంఘ అధ్యక్షుడు కాట్రగడ్డ రమణయ్య, గౌరవాధ్యక్షుడు సిహెచ్.మస్తాన్ రెడ్డి, జి. నాగయ్య, ఆర్ఎల్‌పురం ఏరియా సంఘం అధ్యక్షుడు ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, బుధవాడ ఏరియా సంఘం అధ్యక్షుడు లగడపాటి శ్రీనివాసరావు, భవాని ప్రసాదు, ఏలూరు రోడ్డు సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, మన్నం శ్రీధర్ బాబు, క్రిష్టిపాటి శేఖర్ రెడ్డి, చలపతిరావు, పమిడి సురేష్, సుమారు 600 మంది ఫ్యాక్టరీ యజమానులు పాల్గొన్నారు

సమావేశంలో పాల్గొన్న గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు

పొగాకు కొనే దారేదీ.?

(మొదటి పేజీ తరువాయి)

మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆందోళన చెందవద్దని పదేపదే చెప్పారు. రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయటం వల్ల ప్రభుత్వం పై సుమారు రూ.300 కోట్ల పైబడి ఆర్థిక భారం పడుతుందని, అయినప్పటికీ చివరి ఆకు వరకు కొంటామని చెప్పారు.ఈ మేరకు ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని బర్లీ పొగాకు కొనుగోళ్ళు 7 కేంద్రాలతో ప్రారంభించి మొత్తం 58 కేంద్రాల ద్వారా పొగాకు కొనుగోళ్లు చేపట్టారు. అందుబాటులో ఉన్న గోదాములన్ని నిండిపోవడంతో జిల్లా లోని రైతులు పక్క జిల్లాలకు వెళ్ళి పొగాకు అమ్మకాలు చేశారు. చివరకూ ఇచ్చిన హామీ నుంచి ప్రభుత్వం అర్ధాంతరంగా వైదొలింది. మార్క్ ఫెడ్ ద్వారా నల్లబర్లీ కొనుగోలు ప్రారంభించే నాటికి జిల్లాలో 74 వేల మెట్రిక్ టన్నుల పొగాకు రైతుల వద్ద ఉందని లెక్కలు వేశారు. బర్లీ పొగాకును ఐటీసీ, జీపీఐ సంస్థలు కలిపి 25 వేల టన్నులు, చిన్న కంపెనీలు 20 వేల టన్నుల చొప్పున కొంటారని అప్పట్లో చెప్పారు.ఈ మేరకు 29 వేల మెట్రిక్ టన్నుల నల్లబర్లీని ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా కొనాల్సి ఉంది.కాని ప్రైవేట్ కంపెనీల వారు 20 వేల టన్నుల పొగాకును రైతుల నుంచి కొనుగోలు చేశారు. మార్క్ ఫెడ్ ద్వారా 13 వేల మెట్రిక్ టన్నుల పొగాకు కొన్నారు. ఈ లెక్కల ప్రకారం రాష్ట్రప్రభుత్వం రైతుల వద్ద నుంచి 15 వేల మెట్రిక్ టన్నుల పొగాకు కూడా కొనుగోలు చేయలేదు. ప్రైవేట్ కంపెనీల వారు మరో 25 వేల మెట్రిక్ టన్నుల పొగాకు కొనలేదు. దీంతో 40 వేల మెట్రిక్ టన్నుల పొగాకు నిల్వలు రైతుల వద్దే ఉండిపోయాయి. మార్క్ ఫెడ్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రూ 93 కోట్ల విలువైన పొగాకు కొనుగోలు చేశారు. అందుకు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.63 కోట్ల వరకు జమ చేశారు. ప్రస్తుతం రైతులు తమ వద్ద ఉన్న పొగాకును అమ్ముకోవాలంటే పొరుగు జిల్లాలకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో అనేక వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తుంది. రైతుల నుంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో మరో 10 వేల మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలుకు అనుమతి కోరుతూ అభ్యర్థన పంపినట్లు మార్క్ ఫెడ్ అధికారులు చెబుతున్నారు.ఈ మేరకు రాష్ట్రప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిసింది. పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు మంగళవారంతో ముగిసింది.పొగాకుఉ నిల్వ చేసేందుకు ఎక్కడా గోదాములు లేకపోవడంతో తిరిగి పొగాకు కొనుగోలు చేస్తారా లేదా అనేది సందేహంగా ఉంది.ప్రభుత్వం కూడా పొగాకు కొనుగోలుకు నిధులు వెచ్చించే పరిస్థితి లేదని చెబుతున్నారు. పొగాకు కొనుగోలు కేంద్రాల కొనసాగింపు పై ప్రభుత్వ నిర్ణయం ఏమిటనేది తెలియలేదు. రైతుల వద్ద మిగిలి ఉన్న నల్లబర్లీ పొగాకు సంగతి ఏమిటనేది కూడా అర్థం కావడం లేదు.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No: 6/2025

గద్దె రమేష్ బాబు ...... వాది

Vs

గొట్టిపాటి హనుమంతరావు ..... ప్రతివాది

To

గొట్టిపాటి హనుమంతరావు S/o అంజయ్య
కొత్తపాలెం గ్రామం, బల్లికురవ (మండలం)
బాపట్ల (జిల్లా)

పై నెంబరు దావాని వాది బాకీ వసూలు నిమిత్తం దాఖలా చేసి మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు తేది 10-11-2025న ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటలలోపు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేనిచో దావాని మీ పరోక్షంగా తీర్మానింపబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

ఇంటూరి హనుమంతరావు
రావి హజరత్తయ్య
అద్వకేట్, అద్దంకి

ఒంగోలుప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No.27/2024
IN
O.S.No.45/2023

మోపూరి శ్రీనివాస రెడ్డి ...... వాది/DHR

Vs.

పిడుగు వెంకటేశ్వరరెడ్డి @ వెంకటేశ్వర్లు, etc.,
... ప్రతి వాదులు/JDrs.

To

JDR/R1:

పిడుగు వెంకటేశ్వర రెడ్డి @ వెంకటేశ్వర్లు,
తండ్రి: వెంకట రామిరెడ్డి @ వెంకట రామయ్య,
R.T.C. ఎంప్లాయ్, వయస్సు: 53 సం.
నివాసం: నాంచారెడ్డిపాలెం గ్రామం,
సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా.

వాది డిక్రీ అమలు నిమిత్తం మీపై పై నెంబరు గల అమలు దరఖాస్తు దాఖలు చేసి అమలు దరఖాస్తు దాఖలా షెడ్యూలు ఆస్థి వేలం నిమిత్తం మీ నోటీసు నిమిత్తం తేది:13-10-2025 ఉదయం గం.10:30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయము గా కానీ లేక వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

// కోర్టు వారి అనుమతితో //

ఒంగోలు,
తేది: 30-09-2025. ఇట్లు

ముదివర్తి రాఘవరావు,
పెళ్ళూరి వసుంధర,
మోటుపల్లి రేణుకాదేవి
అడ్వొకేట్స్, సీతారాంపురం, ఒంగోలు.
ఫోన్: +91 9490952792

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-పామూరు : వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పలువురికి మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం మంగళవారం అందజేసినట్లు ఆ సంస్థ చైర్మన్ రామిరెడ్డి తెలిపారు. దివ్య జ్ఞాన సమాజంలో జరిగిన కార్యక్రమంలో పాతపాటి రంగమ్మ, రాచూరి లీలావతి, పిడ తల అంకమ్మ తదితరులకు రూ.5 వేలు చొప్పున అందజే శారు. ఈ కార్యక్రమంలో గండి వెంకటేశ్వర్ రెడ్డి, పువ్వాడ రాంబాబు, టి.వెంకటేశ్వర్లు, గట్ల విజయభాస్కర్ రెడ్డి, యం.ముసలయ్య, బిఎస్ రంగారెడ్డి, ముప్పాళ్ల నరసరాజు, ముక్కు తిరుపతిరెడ్డి, తోట రమేష్, పి.వెంకటాద్రి, కోమటి రమేష్, ఆకుల మాల్యాద్రి, యు.మధుసూదన్ రెడ్డి, ముక్కు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోలాట ప్రదర్శన

ప్రజాశక్తి-కొండపి : మహానవమి సందర్భంగా నేడు మండలంలోని పెద్దకండ్లకుంట గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బుధవారం రాత్రి 7 గంటల నుంచి రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో అ లంకరించి భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని తెలి పారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులకు భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పెద్దకండ్లగుంట నటరాజ కళాబృందం వారిచే జానపద, ఆధ్యాత్మిక కోలాటం ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పా టు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

2న గ్రామసభలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

సంవత్సరంలో నాలుగు సార్లు నిర్వహించబడే ప్రత్యేక గ్రామసభలను పురస్కరించుకుని అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక గ్రామసభను నిర్వహించాలని ఎంపిడిఓ తేళ్ళ రవికుమార్ తెలిపారు. ఈ గ్రామసభలో ప్రభుత్వం తెలియపరిచిన తొమ్మిది ఎజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామసభ ఏర్పాటు గురించి ముందస్తు ప్రచారం గావించి, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు గ్రామసభ నిర్వహణ అనంతరం మినిట్స్ వివరములు, ఫోటోలు సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.32.23 లక్షల విలువైన చెక్కులను 63 మంది లబ్ధిదారులకు మంత్రి తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందని మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను ఆపకుండా సమర్థంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం రూ.కోట్లాది నిధులను వెచ్చిస్తుందన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంతో పేదలను ప్రతినెల ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియరు నాయకులు మక్కెన వెంకటరావు,జరుగుమల్లి మండల టిడిపి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, ఎం.నిడమాలూరు గ్రామ టిడిపి అధ్యక్షులు కాకుమాని శ్రీకాంత్, కాకుమాని శ్రీనివాస్, టిడిపి కార్యదర్శి తాటికొండ సాయి కృష్ణ, దగ్గుమాటి సుబ్బారెడ్డి, కొండూరి శివకోటిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి

గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఉషా వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం రామలింగాపురం శాఖా సమావేశం జుటిక సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వము పేదల కోసం వేసిన ఇళ్ల స్థలాల లేఅవుట్లు ఊరికి దూరంగా ఉండటం నివాసయోగ్యం కానీ ప్రాంతాల్లో కేటాయించటం కారణంగా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారని తెలిపారు. ఈ ప్రభుత్వం అయినా అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల సిపిఎం నాయకులు రాయల మాలకొండయ్య మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో మంచినీళ్ళ, డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్డు సౌకర్యం కల్పించాలని, రామలింగాపురం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, విద్యుత్ దీపాలు లేవని, ఇమ్మడి చెరువు ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, గణేష్‌నికండ్రిక ఎస్సీ కాలనీకి రోడ్డు సౌకర్యం తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మల్లెల దేవమ్మ, కొండపోగు భాగ్యము తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు

పోలీసుల పల్లె నిద్ర

ప్రజాశక్తి-పొన్నలూరు

స్థానిక ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో సోమవారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ మాట్లా డుతూ గ్రామాల్లో జరుగుతున్న సామాజిక ఆర్థిక భద్రత సమస్యలను ప్రత్యక్షంగా అర్థం చేసుకొని వాటి పరిష్కారం కోసం కృషి చేయటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల గురించి గ్రామస్తులకు తగు సూచనలు ఇచ్చారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ వాడకపోవడం వల్ల ఎన్నో అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనుక్ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

నోటీసులు అందజేస్తున్న పెట్లూరు పీహెచ్‌సీ సిబ్బంది

ఆర్‌ఎంపిలకు నోటీసులు అందజేత

ప్రజాశక్తి-కొండపి

పీహెచ్‌సీ సిబ్బంది మండలలోని ఆర్‌ఎంపీలకు నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు రోగులకు ప్రాథమిక వైద్యం మాత్రమే నిర్వహించాలని అనంతరం వైద్యం కోసం దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు పంపించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో రోగులను అడ్మిట్ చేసుకొని ఎక్కువ ప్రభావం కలిగిన మందులు యాంటీబయాటిక్స్ వాడకూడదన్నారు. జ్వరాలు కానీ అసాధారమైన వ్యాధులు మీ దృష్టికి వస్తే వెంటనే సంబంధిత ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని ఆర్‌ఎంపీలకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెట్లూరు వైద్య అధికారి డాక్టర్ ప్రియాంక, ఎంపీహెచ్ఈఓ ఎడుకొండలు, లక్ష్మీనరసింహం, కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నోటీసులు సరే చర్యలు ఏవి?

ఇటీవల తనిఖీలలో ఓఆర్‌ఎంపీ క్లినిక్‌లో స్టెరాయిడ్స్, కాలం చెల్లిన సెలైన్ బాటిల్ డిప్యూటీ డిఎంహెచ్ఓకే చిక్కగా ఇప్పటివరకు ఆ క్లినిక్ నిర్వాహకుడిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. నోటీసులు తీసుకున్న ఆర్‌ఎంపీలు ఈ నోటీసులను లెక్క చేస్తారా? వైద్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలకు రోగిని తరలిస్తారా అన్న అనుమానాలు మండల ప్రజలలో రేకెత్తుతున్నాయి.

కరపత్రాలతో ప్రజలను చైతన్య పరుస్తున్న సిపిఎం నాయకులు

అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకిద్దాం

సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు

ట్రంప్ విధానాలపై కరపత్ర ప్రచారం

ప్రజాశక్తి-కనిగిరి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల దేశంపై పడుతున్న భారం, నష్టాలను నివారించే విధంగా ప్రజలందరూ పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు అన్నారు. మంగళవారం ట్రంపు విధానాల పట్ల కేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజలను చైతన్య పరిచేందుకు పట్టణంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం వివిధ దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని మన వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామికోత్పత్తిని, సేవారంగాన్ని దెబ్బ తీస్తుందన్నారు. రాష్ట్రంలో ఆక్వా, టెక్స్టైల్స్, గార్మెంట్, పట్టు వంటి రంగాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. ఉద్యోగులు, కార్మికులు, రైతాంగం రోడ్డునపడే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరేంద్ర, వలి, ప్రసంగి, కొండలరావు, ఏడుకొండలు, టోపీవలి, రమణయ్య, శ్రీను, ప్రసాదు, వేణుగోపాల్, రవి,గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఎం చెప్పినా నెరవేరని హామీ..!

బ్రిడ్జి పూర్తయినా ప్రారంభం కాని రోడ్డు పనులు

రెండు నెలలు దాటినా మంజూరు కాని నిధులు

ప్రజాశక్తి-దర్శి

గత నెల ఆగస్టు 2వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మండలంలోని తూర్పువీరాయపాలెం గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం లాంచనంగా ప్రారంభించారు. ఆ సమయంలో ఆ గ్రామంలో కొంతమంది ప్రజలు తూర్పువీరయపాలెం నుంచి ఉల్లగల్లుకు వెళ్లే దారిలో వాగు మీద ఆర్అండ్‌బి బ్రిడ్జి పూర్తయి ఏడు సంవత్సరములు గడిచినప్పటికీ గ్రామంలో గ్రూపు రాజకీయాల గుండా అక్కడ పొలం సమస్య కారణంగా రోడ్డు పూర్తికాలేదని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు నెలల్లో సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కానీ రెండు నెలలు గడిచినప్పటికీ సమస్యలకు పరిష్కారం మాత్రం లభించలేదు. పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. అదేవిధంగా ఆ గ్రామంలో రోడ్లు డ్రైనేజీ కూడా పనులు ప్రతిపాదనలకు పరిమితమయ్యాయి. ఆర్అండ్‌బి డీఈ గోపీకృష్ణను వివరణ కోరగా దానికి సంబంధించిన అంచనాలు కోటి 20 లక్షల రూపాయలకు ప్రతిపాదన పంపామన్నారు. అక్కడ భూమి పెండింగ్ ఆక్టివేషన్ కూడా కలిపి ఈ ప్రతిపాదనలు తయారు చేసి పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ నిధులు మంజూరు అయితేనే పనులు మొదలు పెడతామన్నారు. అదేవిధంగా స్థానిక గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజీలు కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అప్పట్లో కలెక్టర్‌ను సభలోని ఆదేశించారు. అంచనాలు తయారు చేయాలని పిఆర్ ఏఇ వెంకటేశ్వరరావును ఉన్నతాధికారులు కోరినట్లు ఏఇ తెలిపారు. మొత్తం ఆ గ్రామంలో డ్రైనేజీ సైడ్ కాలువలు కలిపి మూడు కోట్ల 20 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిధులు మంజూరై పనులు జరుగుతాయని గ్రామస్తులందరూ ఆశిస్తున్నారు. స్థానిక టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి కూడా ఇటీవల కాలంలో మంత్రులను, కలెక్టర్, ఉన్నతాధికారులను కలిసి కృషి చేస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి హామీ మాత్రం రెండు నెలలు కావస్తున్నా నెరవేరలేదు. ఆ హామీలు త్వరలో నెరవేరుతాయని ఆ గ్రామస్తులు ఆశిస్తున్నారు.

నిలిచిపోయిన ఆర్అండ్‌బి రోడ్డు పనులు

ఏడేళ్ల క్రితం పూర్తయిన వాగు మీద బ్రిడ్జి

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం : యుటిఎఫ్

ప్రజాశక్తి - బాపట్ల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెల్లు పూర్తైనా ఉద్యోగ, ఉపాధ్యాయ, ఆర్థిక రంగంలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కారానికి నోచుకో లేదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కానిపక్షంలో వేలాది మంది ఉపాధ్యాయులతో పెద్ద ఎత్తున గుంటూరు పట్టణంలో భారీ స్థాయి బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేస్తుందో వాటన్నిటిని ఉద్యోగ, ఉపాధ్యాయులు పారదర్శకంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అలాంటి ఉపాధ్యాయుల సంక్షేమన్ని చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ ఆర్థిక విభాగం అధికారులు ఒక్కసారి కూడా సమావేశం పెట్టలేదని అన్నారు. విద్యా రంగం, ఆర్థిక రంగంలో సమస్యల పట్ల వాళ్ళ వైఖరిని తెలిజేసే ప్రయత్నం చేయలేదని అన్నారు. ఇంత వరకు 12వ కమిషన్ చైర్మన్ నియమించలేదని అన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయుల వైద్య బిల్లులు రూ.6,500 కోట్లు పెండింగ్లో ఉన్నట్టుగా తెలుస్తోందన్నారు. వాటికి సంబంధించిన ఆర్థిక పరమైన అంశాలు చర్చించే ప్రయత్నం చేయడంలేదని అన్నారు. విద్యా రంగానికి ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న సాల్ట్ ఒప్పందాన్ని రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వమే బాధ్యత తీసుకుని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. సాల్ట్ పథకం వల్లే బోధనేతర కార్యక్రమాలు పెద్ద ఎత్తున పెరిగాయని అన్నారు. బోధనేతర కార్యక్రమాలు రద్దు చేసేందుకు రాష్ట్రం ప్రభుత్వం ప్రయత్నం చేయాలని అన్నారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులు పరిమితం చేయాలన్నారు. అక్టోబర్ 10 లోపు సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబర్ 11 నుంచి ఉద్యమం ప్రారంభిస్తామని తెలిపారు. అక్టోబరు 11 నుంచి 15 వరకు అందరు ఎమ్మెల్యేలకు సామూహిక రాయబారాలు చేసి సమస్యల్ని ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించాలని కోరారు. మండల, జిల్లా, రాష్ట్ర కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేపట్టే ప్రయత్నం చేస్తామని అన్నారు. అక్టోబర్ 30 దాకా కార్యచరణ అమలు చేస్తామన్నారు. అప్పటికి స్పందించకపోతే ఫ్యాప్టో ఉద్యమ కార్యాచరణ ఉద్యమాలతో కలిపి ప్రజాస్వామ్య బద్ధంగా రావాల్సిన కోర్కెల్ని నెరవేర్చుకునే ప్రయత్నం చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో సానుకూలంగా వ్యవహరించకపోతే ఉద్యమానికి సిద్ధపడతామని హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ ప్రచురణ విభాగం ఎం హనుమంతరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జడ వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, సహాధ్యక్షులు బండి బిక్షాలు బాబు, వినోద్ బాబు, రామాంజనేయులు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి, బాపయ్య, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత

బాపుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు

ప్రజాశక్తి - బాపట్ల

ఉపాధ్యాయుల సంక్షేమాన్ని చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధ్యాయుడు గేరా సురేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా పట్టణంలోని కాపు కళ్యాణ మడపంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన హాజరయ్యారు. బహుజన కెరటాలు పత్రిక సంపాదకులు పల్నాటి శ్రీరాములు అధ్యక్షత వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు యుటిఎఫ్ భుజాన వేసుకుని మోస్తుందని అన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులు వినియోగించకుండా కేవలం విద్యా బోధనకు మాత్రమే వినియోగించాలని అన్నారు. బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖరబాబు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి కొన్ని వర్గాలు తిరగ రాయాలనే ప్రయత్నాన్ని తిప్పి పట్టాల్సిన బాధ్యత నేటి ఉపాధ్యాయ వర్గంపై ఉందన్నారు. ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ ప్రామాణికం కాదని, వయసు రీత్యా ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందినప్పటికీ సమ, సమాజ నిర్మాణంలో భావి తరాలను తీర్చిదిద్దేందుకు, సామాజిక సేవకు పునరంకితం కావాలని అన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన ఉద్యోగ విరమణ పొందుతున్న సురేష్ అంబేద్కర్ భావజాలాన్ని సమాజంలో కొందరు తూట్లు పొడవాలని చూస్తున్నారని అన్నారు. అలాంటి విధానాలు తిప్పికొట్టే విధంగా సురేష్ లాంటి విశ్రాంత ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, యుటిఎఫ్ ప్రచురణ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎం హనుమంతరావు, సహాధ్యక్షులు బండి బిక్షాలు బాబు, పాపారావు, వినోద్ బాబు, సుబ్రహ్మణ్యం, రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, బాపయ్య, విజయ్ కుమార్, నూతనపాటి కోటేశ్వరరావు, వై భాస్కరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సలగల రాజశేఖర్ బాబు

సూపర్ లీగ్ ఖోఖోలో రైజింగ్ ఈగల్స్ విజయం

ప్రజాశక్తి - పంగులూరు

గత రెండు రోజులుగా స్థానిక మాగుంట సుబ్బ రామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో జరుగు తున్న సూపర్ లీగ్ ఖో ఖో పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో రైజింగ్ ఈగల్స్ జట్టు విజయం సాధించింది. సౌత్ జోన్ ఖోఖో అసోసియే షన్ వైస్ ప్రెసిడెంట్ కె గురు ప్రసాద్ మాట్లాడుతూ సూపర్ లీగ్ ఖో ఖో పోటీలు నిర్వహించడం వలన క్రీడల్లో మేలుకువలు పెంపొందించి, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయటానికి ఉపయోగపడు తుందని అన్నారు. ఖోఖో క్రీడ వలన క్రీడాకారుల్లో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని అన్నారు. చదువు ఉంటేనే క్రీడల్లో రాణించిన ఉపయోగం ఉంటుందని, అందువలన క్రీడాకారులు చదువుకు ప్రాధాన్యత ఇచ్చి చదువుకోవాలని చెప్పారు. మంచి క్రీడాకారులుగా తయారు కావాలని కోరారు. చదువుతోపాటు క్రీడలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని కోరారు. క్రీడల ద్వారా జీవితానికి ఉపయోగపడే ఉద్యోగాలు సంపాదించుకోవచ్చని తెలిపారు. పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, తమ పిల్లలను చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెట్టే విధంగా అవగాహన కలిగించాలని అన్నారు. నెల్లూరు జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాచినేని గిరి ప్రసాద్, సతీష్‌రెడ్డి సూపర్ లీగ్ పోటీలను పరిశీలించారు. అనంతరం డేవింగ్ డెర్స్, ఫైర్ కింగ్స్ మధ్య జరిగిన పోటీలో డేవింగ్ డేస్ విజయం సాధించగా, రైజింగ్ ఈగల్స్, వైల్డ్ వారియర్స్ మధ్య జరిగిన పోటీలో రైజింగ్ ఈగల్స్ విజయం సాధించినట్లు ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, ఎస్ఆర్ఆర్ ఖో ఖో అకాడమీ డైరెక్టర్ మేకల సీతారామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కోచ్ డిఎల్ రెడ్డి ఉన్నారు.

హోరాహోరీగా సూపర్ లీగ్ ఖో ఖో పోటీలు


సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఆనందబాబు

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంకు చెందిన 11 మంది అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నారు. చికిత్స కోసమైన ఖర్చులను శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సిఎంఆర్ఎఫ్కు సిఫార్సు చేశారు. సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన నిధులను చెక్కు రూపంలో కూచిపూడి, గోవాడ, ప్యాపరు, మోపరు, పాంచాలవరం, ఇంటూరు, అమృతలూరు గ్రామాలకు చెందిన 13 మందికి రు.5,44,177 విలువైన చెక్కులు మంగళవారం అందజేశారు.

సమ్మెలో వైద్యాధికారులు

ప్రజాశక్తి - వేటపాలెం

డాక్టర్ రత్నాంజలి

మండలంలోని వేటపాలెం, పందిళ్లపల్లి పిహెచ్‌సిల వైద్యు లు రాష్ట్ర స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల పిలుపు మేరకు సమ్మెకి వెళ్లారు. రోగుల కోసం ప్రభుత్వం ఏ రత్నాం జలి డాక్టర్‌ను ప్రత్యా మ్నా యంగా కేటాయించిం ది. ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఓపి రోగులను పరిశీలించి వైద్యం అందించారు. ఈ నెల 26 నుంచి దశలవారీగా చేపట్టిన నిరసనలో వైద్యులు ప్రతిష్టా త్మక అధికారిక వాట్సాప్ గ్రూప్‌లను బహిష్కరించారు. ఓపీ సేవలు నిలిపివేసి నిరసన ఉధృతం చేశారు. జిఒ 99 ద్వారా కోత విధించిన ఇన్‌సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరణ చేయాలని, సమయ నిర్ధారిత ప్రమోషన్లు, ట్రైబల్ అలవెన్సు కోసం న్యాయ పరమైన డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. 104 అలవెన్సు నోషనల్ ఇన్‌క్రిమెంట్ కోరుతూ జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీ, అక్టోబర్ 3 నుంచి విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్ఐ జానకి అమరవర్ధన్

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలో కృష్ణా నది వరదల వలన నిర్వాసితులైన మూడు కుటుంబాల బాధితులకు ఎస్ఐ జానకి అమరవర్ధన్ తన వంతుగా రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పర్చూరు

ఆయుష్ శాఖలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయుష్ శాఖ ఉద్యో గులు కోరారు. ఆయుష్ శాఖ జోన్3లో గత ఐదు నెలల్లో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ మంజూరు చేయకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఆరోగ్యం సరిగా లేక కొంత మంది ఇబ్బంది పడుతుంటే మరి కొంతమంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సంబంధిత ఆయుష్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మూడు జిల్లాల అధికారి ఆర్‌డిడి బదిలీ అయ్యి నాలుగు నెలలవుతున్న రెగ్యులర్ ఆర్‌డిడిని నియమించలేదని తెలిపారు. ఇన్చార్జ్ ఆర్‌డిడిని నియమిం చినప్పటికీ ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులు, జిపిఎఫ్ దరఖాస్తులతో ఒంగోలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. గత 36ఏళ్లల్లో ఇలాంటి సమస్య ఎప్పుడు ఏర్పడలేదని చెప్పారు. గత ఐదు నెలలుగా తమ సమస్యలు ఇప్పటివరకు పరిష్కారం కాలేదని చెప్పారు. అధికారులు పట్టించుకోని తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆనందబాబు

వరద ప్రభావిత గ్రామాల్లో పరిశీలన

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలో కృష్ణా నది వరద ప్రభావిత గ్రామాలను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మంగళవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద వల్ల ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ముంపుకు గురైన గ్రామాల్లో తక్షణమే సహాయక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు అవసర మైన తాగునీరు, ఆహారం, వైద్య సేవలు తాత్కాలిక నివాస సదుపాయాలు అందే విధంగా చర్యలు వేగవంతం చేయా లని సూచించారు. పంటలు నష్టపోయిన రైతులను కలిసి మాట్లాడారు. తక్షణమే పంట నష్టంపై సర్వే నిర్వహించి పరిహారం అందే విధంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని ఆదేశించారు. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని విధాల ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యుత్తు, రవాణా వ్యవస్థ త్వరితిగతిన పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ముంపు ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షిస్తానని తెలిపారు. వరదలకు పంటలు నష్టపోయే రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. రైతులు, ప్రజలు అధైర్య పడాల్సిన పనిలేదని చెప్పారు. అధికారులు నిత్యం అందుబాటులో ఉండి సహాయక చర్యలు తీసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, వేమూరు ఎఎంసి చైర్మన్ జి పూర్ణ కుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి డ్రోన్ వినియోగంపై శిక్షణ

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక మారుతి ఐటిఐ కాలేజీలో రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించను న్నారు. అహ్మదాబాద్ డ్రోన్ ల్యాబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివ రావు, ఎపి సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి బోడపాటి పాల్గొననున్నట్లు తెలిపారు. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ పాలక మండలి సభ్యులు అన్నదాత మణి, రాష్ట్ర ఉపాధి, శిక్షణ సంచాలకులు ఎస్ సత్యనారాయణ, ఉపసంచాలకులు డి నాగవర్ధరాజు పాల్గొంటారని తెలిపారు.

ప్రజాశక్తి 5
బుధవారం 1 అక్టోబర్ 2025

చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఈనెల 7 చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో పిలుపునిచ్చింది. ఒంగోలు ఎస్‌టియు భవన్‌లో సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. యుటిఎఫ్, ఏపీటీఎఫ్ 1938, ఏపీటీఎఫ్ 257, ఎస్‌టియు, బిటిఎ, పిఇటి అసోసియేషన్, హెచ్ఎంఎ అసోసియేషన్ తదితర ఉపాధ్యాయ సంఘాలు సమావేశంలో పాల్గొన్నాయి. 20 డిమాండ్లతో ఫ్యాప్టో రాష్ట్రవ్యాప్త పోరాటానికి మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలపై మొండివైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటినా మెరుగైన పిఆర్‌సి, మధ్యంతర భతి, సిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు లాంటి ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం చర్చ కూడా జరపలేదన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రోడ్‌మ్యాప్ ప్రకటించాలని ఫ్యాప్టో పలుమార్లు కోరినా స్పందన లేదన్నారు సిపిఎస్ ఉద్యోగుల పెన్షన్ విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పినట్లు తెలిపారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఫైల్ నాలుగేళ్లుగా ఆర్థికశాఖలో నిలిచిపోయిందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యూటీ, కమ్యూటేషన్, ఇఎల్, ఎన్‌కాష్‌మెంట్ అంత్యక్రియల ఖర్చులు ఇవ్వకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కాగుటూరి యర్రయ్య మాట్లాడుతూ కారుణ్య నియామకాలలో జాప్యం వల్ల మరణించిన ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. వెంటనే కారుణ్య నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతర్ జిల్లా బదిలీల్లో స్పౌజ్ కేటగిరీ వారికి న్యాయం చేయాలన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, జేఎల్ పదోన్నతుల సమస్య మూడు దశాబ్దాలుగా పరిష్కారం కాలేదన్నారు. డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్.రవి, డి.శ్రీనివాసులు, కో చైర్మన్ వి.మాధవరావు, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించాలన్నారు. హెల్త్‌కార్డులపై ప్రతీ సంవత్సరం రూ.180 కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నా ఆసుపత్రుల్లో ఉపయోగం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లస్ టూ పాఠశాలల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. పురపాలక ఉపాధ్యాయులకు జిపిఎఫ్, అర్బన్ ఎంఇఓ పోస్టులు మంజూరు చేయాలన్నారు. గురుకుల, ఆదర్శ, 1998, 2008 ఎంటిఎస్ టీచర్ల రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతనాలు, ఎంటిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో చల్లా శ్రీనివాసులు, వై.శ్రీనయ్య, కే.దేవ సహాయం, బి.అశోక్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను

ఉపసంహరించుకోవాలని నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పిపిపి పేరుతో మెడికల్ కాలేజీల ప్రైవేటికరించే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని కోరుతూ వైసిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలోనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర నాయకులు కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేదలు, ఎస్‌సి,ఎస్‌టిలకు వైద్యాన్ని మరియు వైద్య విద్యను దూరం చేసే కుట్రలో భాగమని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజాహక్కులను కాపాడాల్సిన పాలకులు కార్పొరేట్ల ప్రయోజనం కోసం వాటిని కాలరాస్తున్నట్లు ఆరోపించారు. రాజ్యాంగం ప్రకారం ఉచిత విద్య, ఉచిత, వైద్యం అందించాల్సిన ప్రభుత్వాలు వాటిని దూరం చేస్తున్నట్లు ఆరోపించారు.వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం వెనుక కార్పొరేట్ల ప్రయోజనం మాత్రమే ఉందన్నారు. ఈ విధానంతో సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులు డాక్టర్ అవ్వాలన్న కల కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య కళాశాల ప్రభుత్వ రంగం లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించకపోతే, ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిముట్టి దేవప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిలకా ఇశ్రాయేలు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దుడ్డు వినోద్, ఎస్‌సి సెల్ ఒంగోలు పట్టణ అధ్యక్షుడు గోపిచంద్, మాజీ ఎంపిపి కె. నరసింహారావు, జె. ఇశ్రాయేలు, మధు, కంభంపాటి సన్నిబాబు, జి. సామేలు, డగ్లస్, దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు జి. ఏసుదాసు, మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షుడు ఆదిమూలపు లూకా, పూనూరి దేవదానం, సంతనూతలపాడు నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు తేళ్ల పుల్లారావు, మద్దిపాడు మండల అధ్యక్షులు రాయపాటి విల్సన్, మద్దిపాడు మండల కల్చరల్ వింగ్ అధ్యక్షుడు కావూరి యేసోబు, ఒంగోలు పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం బుజ్జి, నాయకులు చావలి పీటర్, ఎస్‌సి సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉన్నం జనార్ధన్, వైసిపి సంతనూతలపాడు అధ్యక్షుడు దుంపా చెంచి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా : వైసిపి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

అన్యాయానికి గురైన కార్యకర్తలకు అండగా నిలవడమే డిజిటల్ బుక్ ముఖ్య ఉదేశ్యమని వైసిపి ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్ తెలిపారు. వైసిపి జిల్లా కార్యాల యంలో వైసిపి డిజిటల్ బుక్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆవిష్కరించిన డిజిటల్ బుక్ కార్యకర్తల స్థాయికి చేరువ చేసేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర ఉపాధ్యక్షుడు కె. రోశయ్య, వాలంటీర్ విభాగం ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షుడు నాటారు జనార్ధన్ రెడ్డి, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు బత్తుల ప్రమీల, సిటీ లీగల్ సెల్ అధ్యక్షుడు సంపత్, వికలాంగం విభాగం నగర అధ్యక్షుడు మీరావలి, కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్, కో ఆప్షన్ సభ్యులు శ్యాంసాగర్, 33వ డివిజన్ అధ్యక్షుడు మీరావళి, 11వ డివిజన్ అధ్యక్షుడు కపా కిరీటి, నగర కల్చర్ విభాగం అధ్యక్షుడు సమీర్, బీసీ సెల్ అధ్యక్షుడు సుతారం శ్రీను, ప్రధాన కార్యదర్శి గడ్డం బాలకోటయ్య, ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, మైనార్టీ విభాగం నగర అధ్యక్షుడు చానా, కరుణాకర్, సోషల్ మీడియా నగర అధ్యక్షుడు చవల పీటర్, జిలాని బాషా, పిగిలి శ్రీనివాస్ రావు, ఆనం శ్రీనివాస్ రెడ్డి, టి. రమేష్ బాబు, బాలకష్ణ వీసం, అశోది యలమందరెడ్డి, సతీష్, అబ్దుల్ కుద్దుస్, అబ్దుల్ రజాక్, మద్దు ప్రతాప్, టి. కరుణాకర్, జఫరుల్లా, షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

నేడు ఇంటింటికీ పించన్ల పంపిణీ లేదు

గ్రామ సచివాలయ జెఎసి అల్టిమేటం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఇంటింటికీ తిరిగి సామాజిక పింఛన్లు పంపిణీ చేసేది లేదని, సచివాలయం వద్దనే పంపిణీ చేస్తామని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జెఎసి మంగళవారం అల్టిమేటం జారీ చేసింది. డోర్ టు డోర్ సర్వీసులు నిరాకరణలో భాగంగా పెన్షను పంపిణీ ప్రక్రియను ఇకనుంచి ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే సచివాలయాల్లోనే చేపట్ట నున్నట్లు సచివాలయ ఉద్యోగులు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచి శ్వేత పత్రం ఇచ్చే వరకూ అఫిషియల్ వాట్సాప్ గ్రూప్స్ లోనూ జాయిన్ కారాదని నిర్ణయించారు. గ్రూప్ లో ఆడ్ చేయకుండా పర్మిషన్ సెట్టింగ్స్ మార్చాలని జెఎసి ప్రకటించింది. జెఎసి తిరిగి రిప్రెజెంట్ చేసే వరకు వాట్సాప్ గ్రూప్స్ లో జాయిన్ అవ్వరాదని పేర్కొన్నారు. డోర్ టు డోర్ సర్వేలకు, డోర్ టూ డోర్ సేవలకు ప్రభుత్వం ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. డోర్ టు డోర్ సర్వే నుంచి తప్పించాలని ప్రభుత్వానికి అనేక పర్యాయాలు విజ్ఞప్తి చేసినప్పటికీ మొండి వైఖరితో వ్యవరిస్తున్నట్లు జెఎసి తీవ్రంగా విమర్శించింది. ఇంటింటికి తిరిగి చేపట్టే పనుల వల్ల తమ ఆత్మ గౌరవానికి ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో పెన్షన్లు సచివాలయం లోనే ఇచ్చేందుకు అధికారులు అనుమతించాలని కోరుతున్నట్లు వారు ప్రకటించారు. వికలాంగులు, బెడ్ రిడెన్ పేషెంట్స్, మరియు మంచానికి పరిమితమైన వద్దులకు,వారి నివాసాల వద్ద పంపిణీ చేస్తామని ప్రకటించారు. మిగిలిన లబ్ధిదారులు తప్పనిసరిగా సచివాలయానికి వచ్చి పెన్షన్ పొందాలని జెఎసి విజ్ఞప్తి చేసింది. లబ్ధిదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

నేడు బాక్సింగ్ గేమ్స్ సెలెక్షన్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు 69వ స్కూల్ గేమ్స్ బాక్సింగ్ అండర్-14, 17, 19 బాలురు, బాలికల సెలెక్షన్లు బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక గద్దలగుంట లోని ఎస్పికెఆర్ఎస్ విఎన్ ఓరియంటల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. సెలెక్షన్ వివరాల కోసం ఎస్‌జిఎఫ్ఐ సెక్రటరీలు డాక్టర్ చక్కా వెంకటేశ్వర్లు, శిరీషా కుమారి లేదా 9849429839, 9849076920సెల్ నంబర్లలో సంప్రందిచాలన్నారు.

1,2 తేదీల్లో ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈనెల ఒకటి, రెండు తేదీల్లో కార్యక్రమాల్లో పాల్గొన్నన్నారు ఈ నెల 1న సాయంత్రం ఐదు గంటలకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాత్రి 7:30 గంటలకు విజయదశమి దేవీ నవరాత్రుల సందర్భంగా పలు దేవాలయాలలో నిర్వహించే పూజా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఈనెల2వ ఉదయం 8 గంటలకు తన కార్యాలయంలో కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. తొమ్మిదిన్నర గంటలకు మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు 11.30 గంటలకు గుంటూరు రోడ్డులో ఇనాబత్తిన రాము దీప స్లీప్ మాట్రేస్ షాపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 2 గంటలకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు పీజీ ఇన్ సర్వీస్ కోటా వ్యవహారంలో ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో జిల్లా లోని అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు. జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్యులను జిజిహెచ్ నుంచి కమ్యూనిటీ వైద్యశాలల నుంచి వైద్యులను కేటాయిస్తూ ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు 24 గంటలూ పనిచేసేలా ఒంగోలు కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో కంట్రోలు రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1077, 08592-281400 ఫోన్ నెంబర్స్ ను కేటాయించినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు వైద్య సేవలు అందడంలో ఏవైనా సమస్యలు ఉన్నా లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిన వైద్యులకు ఏవైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ కు కేటాయించిన ఫోన్ నెంబర్ల కు ఫోన్ చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు. జిల్లా లోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ కళాశాల నుండి 50 మంది వైద్యులను, కమ్యూనిటీ వైద్యశాలల నుండి 20 మంది వైద్యులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి మండల పరిధిలో ఒక 108 వాహనంను అత్యవసర కేసుల నిమిత్తం ప్రతి పిహెచ్సి కిమ్యాప్ చేసినట్టు తెలిపారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఉమెన్ జాబితాను ముందస్తు జాగ్రత్తలు నిమిత్తం అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపినట్లు కలెక్టర్ తెలిపారు.

నేడు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా : ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు వంద శాతం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద మొత్తం 2,27,105 మందికి వివిధ రకాల పెన్షన్లకు రూ. 97.73 కోట్ల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి పెంచన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందరాదని, అధికారులు ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లు అందజేస్తారని పేర్కొన్నారు. బుధవారం పెన్షను తీసుకోలేని వారు గురువారం తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రకాశం బ్యారేజ్‌కు వరద ఉధృతి భారీగా పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు. ప్రస్తుతం 6.70 లక్షల క్యూసెక్కుల పైగా నీరు విడుదల కావడంతో లంక గ్రామాలు, తీర ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు అధికంగా రావడంతో వరద ముంపు ఏర్పడిందని అన్నారు. దీని వలన ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళ వారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపల్లె ప్రాంతంలో 28 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

అనంతరం మండలంలోని పెనుమూడి, పల్లిపాలెం మత్స్యకార కుటుంబాలను పునరావాస కేంద్రంలో పరామర్శించారు. సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పునరావాస కేంద్రాల్లోని వారందరికీ ఎప్పటికప్పుడు వైద్య పరంగా సమస్యలు లేకుండా మందులు అందజేయాలని సూచించారు. పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా బ్లీచింగ్, సున్నం చల్లించాలని చెప్పారు. వరద నీరు తగ్గేవరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని బాధితులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డిఓ రామలక్ష్మి, తహశీల్దారు ఎం శ్రీనివాసరావు, ఎంపిడిఒ సిహెచ్ రవిబాబు, కార్యదర్శి అబిద్ హుస్సేన్, ఆర్‌సి అధికారి నాయక్, టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాసరావు, పి మురళీధరరావు, డి వెంకటేశ్వరరావు, కె ధనుంజయరావు, కె వెంకటేశ్వరరావు, కె రాము, సాయికుమార్, నరేష్, రవిశంకర్, ధర్మతేజ పాల్గొన్నారు.

నిరుపయోగంగా దేవుడి మాన్యం

ప్రజాశక్తి - పంగులూరు

దేవాలయ భూమిని ఎవరు అమ్మకూడదని, అమ్మితే నేరమని, వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు జడ్జిమెంట్ ఇచ్చినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి, ఆ భూమిని పట్టించుకోలేదు. దీంతో రూ.కోట్ల విలువ చేసే భూమిలో తుమ్మ చెట్లు పెరిగాయి. ఎందుకు పనికి రాకుండా ఉంది. హైకోర్టు ఆదేశాలు పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కొండమూరులో ఉన్న మల్లేశ్వరస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు దేవాలయాలకు సంబంధించి 15ఎకరాల భూమి జాగర్లమూడి వారిపాలెంలో జాతీయ రహదారి పక్కనే ఉంది. ఈ భూమిని భజంత్రీలకు ఇచ్చారు. అయితే కొంత కాలం తర్వాత ఆ భూమిని భజంత్రీలు వేరొకరికి అమ్మారు. ఆ విధంగా ఇప్పటికీ ఆ భూమి మూడు చేతులు మారింది. ఈ భూమిలో కొంత జాతీయ రహదారి విస్తరణలో పోగ ఇప్పుడు 11.50ఎకరాలు మాత్రమే

ముళ్ళ చెట్లతో నిండిపోయిన దేవాదాయ శాఖ భూమి

ఉంది. ఇందులో మల్లేశ్వరస్వామి దేవాలయం క్రింద 10.40 ఎకరాలు, రాజ్యలక్ష్మి అమ్మవారు దేవాలయం కింద 1.10 ఎకరాలు ఉంది. ప్రస్తుతం ఈ భూమి విలువ ఎకరా రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఇంత విలువైన భూమిని బయట వ్యక్తులకు అమ్మటం సరైంది కాదని, ఇది దేవాలయం క్రిందే ఉండాలని, కొండమూరు గ్రామానికి చెందిన వాసెపల్లి సుబ్బారెడ్డి 2006లో లోకాయుక్తలో కేసు వేశారు. 2011లో ఆర్డీఒను విచారణ చేయాలని లోకాయుక్త ఆదేశించింది. ఈ భూమిని వెంటనే ఈ భూమిని స్వాధీనం చేసుకొని దేవాలయానికి అప్పగించాలని 2019 నవంబర్‌లో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయినప్పటికీ ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి అధికారులు సాహసం చేయలేదు. అప్పటి నుండి ఆ భూమిలో ముళ్ళ చెట్లు పెరిగి అడవిని తలపిస్తుంది. రూ.కోట్ల విలువైన భూమి నిరుపయోగంగా ఉండిపోయింది. కొంత భూమి ఆక్రమణకు గురవుతుంది. అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఆ దేవాలయాల కార్యనిర్వహణాధికారి జి వాసు బాబును 'ప్రజాశక్తి' వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని, తనకేమీ తెలియదని తెలిపారు. భజంత్రీలకు చెందిన వారు సుప్రీం కోర్టుకు వెళ్లినట్లు తెలిసిందని చెప్పారు. దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వరరావును వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సొసైటీకి పూర్వ వైభవం తీసుకొస్తా

కొండ మంజులూరు సొసైటీ అధ్యక్షుడు బత్తుల వెంకట్రావు

ప్రజాశక్తి - పంగులూరు

కొండ మంజులూరు సొసైటీ అధ్యక్షుడు బత్తుల వెంకట్రావు

మండలంలోని కొండమంజులూరు సొసైటీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తానని సొసైటీ అధ్యక్షులు బత్తుల వెంకట్రావు అన్నారు. గతంలో ఈ సొసైటీ ఎంతో బాగుండేదని అన్నారు. రైతులకు అండదండలుగా నిలిచిందని అన్నారు. అలాంటి సొసైటీ నేడు దీనవస్థలో ఉందని అన్నారు. దానిని బాగు చేయటమే కాకుండా సొసైటీ పరిధిలోని రైతాంగానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఈ సొసైటీ కొండ మంజులూరు, రామకూరు, బైట మంజులూరు, భగవాన్ రాజుపాలెం, కళ్ళంవారిపాలెం గ్రామాల పరిధిలో ఉందని తెలిపారు. ఐదు గ్రామాలతో పెద్ద సొసైటీగా ఉందని అన్నారు. ఈ సొసైటీ ద్వారా రైతాంగం, వ్యవసాయ సీజన్లో కావలసిన రుణ సౌకర్యాన్ని పొందే వారని తెలిపారు. ఎరువులు కూడా రైతులకు సొసైటీ అందించేదని చెప్పారు. రైతులకు ఎంతో ఉపయోగపడుతున్న ఈ సొసైటీని వైసిపి ప్రభుత్వంలో విచ్ఛిన్నం చేశారని తెలిపారు. సొసైటీని సర్వనాశనం చేశారని అన్నారు. సొసైటీకి రైతులు రావడం మానుకున్నారని అన్నారు. సొసైటీ భవనం చుట్టూ పిచ్చి చెట్లతో నిండిపోయి ఉందని చెప్పారు. తాను బాధ్యతలు తీసుకున్న వెంటనే సొసైటీ భవనం చుట్టూ ఉన్న చెట్లు తొలగించి మెరకతోలించానని, వర్షపు నీళ్ళు నిలబడకుండా చేశానని చెప్పారు. సొసైటీ భవనంలో అవసరమైనన్ని కుర్చీలు, ఫ్యాన్లు లేవని తెలిసి కుర్చీలు, ఫ్యాన్లు సమకూర్చానని తెలిపారు. త్వరలో గేటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా వాచ్ మెన్‌ను ఏర్పాటు చేశానని తెలిపారు. సీఈఓను నియమించి ఏర్పాటులో ఉన్నట్లు తెలిపారు. ఈపాటికే సొసైటీ ద్వారా రైతులకు రుణాలు ఇస్తున్నామని తెలిపారు. రైతులు పెట్టుబడి రుణాల కోసం ప్రవేటు వ్యక్తులను ఆశ్రయించే పరిస్థితి లేకుండా చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సంవత్సరం ఎల్‌టి రుణాలు, పంట రుణాలు కలిపి రూ.2కోట్ల వరకు రైతులకు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి రైతుకు పంట రుణాలు అందించి, సహకరిస్తామని చెప్పారు. ప్రస్తుతం రైతు సేవ కేంద్రం నుండి ఎరువులు అమ్ముతున్నామని తెలిపారు. త్వరలో సొసైటీ ద్వారా ఎరువులు తెప్పించి అమ్ముతామని చెప్పారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చేస్తామని తెలిపారు. సొసైటీ పరిధిలోని వ్యవసాయ భూముల అభివృద్ధి, పంట పొలాలకు రహదారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు ఇబ్బంది లేకుండా చేస్తామని చెప్పారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు సొసైటీ పరిధిలో చేయగలిగిన కృషి చేస్తామని అన్నారు. రుణాలు కావాల్సిన రైతులు సొసైటీలో సంప్రదించాలని కోరారు. సొసైటీ ద్వారా ఈ ఏడాది పంటలు కొనుగోలుకు ప్రయత్నిస్తామని అన్నారు.

ప్రమాదానికి కారణమైన కారు

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

అద్దంకి, తిమ్మాయపాలెం రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో కారు బైకును ఢీ కొట్టింది. తిమ్మాయపాలెంకు చెందిన చెందిన అడుసుమల్లి శ్రీనివాసరావు సమీప పెట్రోల్ బంకులో పెట్రోల్ నింపుకొని తిమ్మాయపాలెంకు వెళుతున్న సమయంలో గిద్దలూరు నుండి ఏలూరు వెళ్తున్న కారు ద్విచక్ర వాహన దారుడిని ఢీ కొట్టింది. ప్రమాదంలో బైకుపై ఉన్న శ్రీనివాసరావుకు కాలుకి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు 108కి సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటన స్థలానికి సిఐ సుబ్బరాజు చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. కారును స్థానిక స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక రోటరీ భవన్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ తెలిపారు. ప్రపంచ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా శిబిరాం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల అనేక రోడ్డు ప్రమాదాలతోపాటు ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం పెరిగిందని తెలిపారు. ప్రాణదానంతో సమానమైన రక్త దానం చేయడానికి ఆసక్తి ఉన్న దాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం ఇవ్వొచ్చని తెలిపారు.

డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

డిజిటల్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సంతమాగులూరు

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకు బరోసా ఇచ్చేందుకు రూపొందించిన వైసిపి డిజిటల్ బుక్ మంగళవారం ఆవిష్కరించారు. పుట్టావారి పాలెం అడ్డ రోడ్డు జంక్షన్లోని వైసిపి కార్యాలయంలో వైసిపి అధ్యక్షులు ఊట్ల నాగేశ్వరరావు మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి ఎస్సీ సెల్ కార్యదర్శి పోపూరి వెంకయ్య, గడ్డం నర్సిరెడ్డి, కేసరి చెన్నారెడ్డి, షేక్ ఖాదర్ బాషా, రామాంజనేయరెడ్డి, రాణి రాజు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో ఆవులను పరిశీలిస్తున్న కమీషనర్

వీధి ఆవులను శ్రీశైలం గోఆశ్రమానికి తరలిస్తాం

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తూ వాహన దారులు, పాదాచారులు, పారిశుద్ధ్య పనులకు ఇబ్బంది కలిగిస్తున్న ఆవులను శ్రీశైలం ఆశ్రమానికి తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలో ఆవుల సంచారాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు మైకు, కరపత్రాలు, సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు. ఆవుల యజమానులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఆవుల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆవులను సోమవారం రాత్రి పట్టుకొని 4వ వార్డు హిందూ స్మశాన వాటికకు తరలించారు. శానిటరీ ఇన్స్‌స్పెక్టర్‌కు నిర్ణయించిన చలానా చెల్లించి ఆవుల యజమానులు ఆవులను తోలుకెళ్లాలని తెలిపారు. 5 రోజుల్లో ఆవుల యజమానులు స్పందించకపోతే ఈనెల 7న శ్రీశైల గో ఆశ్రమానికి తరలిస్తామని తెలిపారు.

యనమదల బస్టాండు వీధిలో కుక్కల స్వైర విహారం

కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలో అన్ని గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. యనమదలలో కుక్కలు ఎక్కువై రోడ్డున నడచి వెళ్లే వాళ్ళను కరుస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలకు అడ్డం రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. గ్రామంలో కుక్కలు ప్రక్క గ్రామం నుండి తెచ్చి తమ గ్రామంలో వదిలిపెట్టి వెళ్ళారని గ్రామస్తులు చెబున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని సైతం కుక్కలు వెంబడిస్తుండటంతో తప్పించుకునేందుకు వేగంగా వైకులు నడుపుతూ ప్రమాదానికి గురవుతున్నారని గ్రాస్థులు చెబుతున్నారు. పిల్లలను బయటికి పంపాలంటే భయమేస్తుందని తెలిపారు. పంచాయతీ అధికారులు, సచివాల అధికారులు పట్టించుకోని గ్రామాల్లోని కుక్కలు ఎవని కరవక ముందే వాటి బెడద తొలగించాలని కోరుతున్నారు. ప్రస్తుతం దసరా సెలవులకు చిన్న పిల్లలు రోడ్లపై ఆడుకుంటున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే కుక్కలను పట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి 7
బుధవారం 1 అక్టోబర్ 2025

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనాలు

అవస్థలు పడుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - రేపల్లె

పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు ప్రీ స్కూల్ నిర్వహించేందుకు, చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతల సంరక్షణే ధ్యేయంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తుంది. కేంద్రాలకు భవనాల కొరత వెంటాడుతోంది. గతంలో వివిధ పథకాల్లో భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో గుత్తేదారులు సగం వరకు పనులు చేపట్టారు. బిల్లులు రాకపోవడంతో నిర్మాణం పనులు అర్ధాంతరంగా ఆపేశారు. దీంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం చిన్నారులకు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా అర్థాంతరంగా ఆగిన భవనాలు పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. రేపల్లె సిడిపిఒ కార్యాలయం పరిధిలో కనీసం రెండొవ వంతు కూడా సొంత భవనాలు లేవు. ఉన్న భవనాల్లో కూడా వసతులు లేక అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. రేపల్లె ప్రాజెక్ట్ పరిధిలో 192 కేంద్రాలు ఉండగా 190 మంది కార్యకర్తలు ఉన్నారు. వీటిలో 8 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అంగనవాడీ కేంద్రాలకు సొంత భవనాల

వసతులు లేని అంగన్‌వాడీ భవనం

ఊసే లేకుండా పోయింది.

సొంత భవనాలు లేక అవస్థలు

రేపల్లె సెక్టార్ పరిధిలో 192 కేంద్రాలు ఉండగా వాటిలో 74 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 118 కేంద్రాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. 44 అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. ఉన్న వాటిలో కనీసం మౌలిక సదుపాయాలు సూన్యమే. ఎప్పుడు ఉంటాయో ఎప్పుడు పోతాయో తెలియని పరిస్థితి. 192 కేంద్రాలకు గాను 7 మంది సూపర్ వైజర్లు ఉండాల్సి ఉండగా ఆరుగురు ఉన్నారు. దీంతో ఆయా కేంద్రాల పర్యవేక్షణకు సూపర్ వైజర్లపై పనిఒత్తిడి పెరిగిపోయింది.

కూటమి ప్రభుత్వంలో నిధులు మంజూరు

పంచాయితీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద 192 భవనాలకు గాను 17 కేంద్రాలకు రూ.15వేలు నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. కేంద్రాల్లోని పిల్ల రక్షణకు 8 కేంద్రాలకు రూ.10వేల నిధులతో కంచె, గార్డెన్ ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని కేంద్రాలకు మంచినీటి వసతి కల్పనకు 80 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఉన్న భవనాల్లో కొంత మేరకు వసతులు కల్పిస్తున్నప్పటికీ సొంత భవనాల కొరత మాత్రం వెంటాడుతూనే ఉంది.

ప్రతిపాదనలు పంపించాం

అసంపూర్తిగా ఉన్న అంగన్ వాడీ భవనాలు పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సిడిపిఒ ఎం సుచిత్ర తెలిపారు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని తెలిపారు. మంజూరు కాగానే పనులు మళ్లీ ప్రారంభించేలా చూస్తామని తెలిపారు. చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిడిపిఒ ఎం సుచిత్ర

లంక గ్రామాలను చుట్టుముట్టిన వరద

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణా నదికి విడుదలైన వరద నీరు లంక గ్రామాలను చుట్టుముట్టింది. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. భట్టిప్రోలు మండలంలో లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి వెల్లటూరు నుండి కరకట్ట కింద రహదారి నీట మునిగింది. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. లంక గ్రామల నుండి వెల్లటూరుకు రావడానికి ట్రాక్టర్లను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటి వాటిని అధికారులు రాకపోకలు పూర్తిగా నిషేధించారు. గడచిన నాలుగు రోజులుగా 6.50 లక్షల క్యూసెక్కులు కొనసాగుతూనే ఉంది. అంతకుమించి నీటి విడుదల లేకపోవడంతో గ్రామాల్లో ప్రజలు అక్కడే ఉండిపోయారు. నీటి విడుదల మరో లక్షకు పెరిగితే గ్రామాల్లోని రహదారులు మునిగిపోయి ఇళ్లను

లంక గ్రామాల నుండి బయటికి వస్తున్న గ్రామస్థులు

చుట్టుముట్టే పరిస్థితి ఉంటుంది. ఈపాటికే పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పసుపు, కంద, అరటి పంటలు నీట మునిగాయి. నీరు అధికమైతే గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లోనే ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. లంక గ్రామాలకు వెళ్లే ఓలేరు, కోళ్లపాలెం, పెదపులివర్రు, ధోనేపూడి గ్రామాల మధ్య చిన్న రేవుపై చెప్టాలు పూర్తిగా మునిగిపోవడంతో లంక గ్రామాల ప్రజలకు బయట గ్రామాలతో సంబంధాలు నిలిచిపోయాయి. లంకవాసులు బయట గ్రామాలకు రావడానికి ప్రధాన మార్గం వెల్లటూరు మాత్రమే. అది కూడా కరకట్ట సమీపంలో నాలుగు అడుగుల లోతులో రహదారిపై నీరు ప్రవహిస్తుండటంతో పాదాచార్యులు, ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిపివేశారు. వరద పరిస్థితి ఎప్పటికప్పుడు వేల సంఖ్యలో పెరుగుతూ తగ్గుతూ ఉంటుంది. ఇదే రీతిలో కొనసాగితే లంక గ్రామాలకు భారీ నష్టం జరిగే పరిస్థితి. మరింత వరద నీరు విడుదల అయితే లోతట్టు ప్రాంతాలతో పాటు సాధారణ ప్రాంతాలు కూడా పంటలు మునిగిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నీటి వ్యాపారం

- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - వేటపాలెం

శుద్ధి చేసిన జలం అని అమ్ముతున్న నీరు పేపర్ మీద నిబంధనలాగా ఉన్నాయి. వాస్తవానికి అవి ప్రజల జబ్బులకు టిక్కెట్ లా మారుతున్నాయన్నది వాస్తవం. నియోజకవర్గంలో 100కి పైగా ఆర్‌ఒ ప్లాంట్లు, 10 బాటిలింగ్ యూనిట్లు నడుస్తున్నాయి. వాటిలో ఒక్కదానికి మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఐ సర్టిఫికేట్ ఉండగా మిగిలిన 9 యూనిట్లు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్భయంగా వ్యాపారం చేస్తున్నారు. కొత్తపేట పంచాయితీ పరిధిలోని రెండు యూనిట్లు 14 అంకెల నెంబర్‌లో 13 అంకెలే వాడుతూ నకిలీ సర్టిఫికేట్ చూపెడుతుండగా ఒకరు మోనోగ్రామ్ వేసి కళ్లముందే అమ్మకాలు సాగిస్తున్నారు. ఆహార తనిఖీ అధికారులు, జోన్, జిల్లా అధికారులు నామమాత్రపు తనిఖీలకే వచ్చి వెళుతున్నారు. నోటీసుకే పరిమితం అయ్యారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. పరిశీలన పేరుతో వెళ్లి యజమానులతో రహస్య ఒప్పందాలు చేసుకొని వెనుదిరుగుతున్నారని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్ఒ నీటిని ధూళి రహిత గదుల్లో నింపాలనే నిబంధనలు ఉల్లంఘిస్తూ, బహిరంగ ప్రదేశాల్లోనే కాయిన్ బాక్స్ బాటిలింగ్ జరుగుతోంది. కేవలం వ్యాపార పరమైన

వాటర్ బాటిల్‌పై ఎఫ్ఎఎస్ఎస్ఐ పర్మిషన్ ఉన్నట్లు 13 అంకెల నెంబరు వేసిన దృశ్యం

మోసం కాదు. పిల్లల్లో జ్వరం, పెద్దల్లో కడుపు సమస్యలు, గర్భిణీల ఆరోగ్యం అన్నీ ఈ నిర్లక్ష్యం భారాన్ని మోస్తున్నాయి. నీటిని విక్రయించే యూనిట్లు ప్రభుత్వ నిబంధనల్ని పక్కన పెడితే, వాటిని అమలు చేయాల్సిన అధికారుల నిర్లక్ష్యం ఇంకో పెద్ద సమస్యగా మారింది. ప్రజలు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. అనుమతుల్లేకుండా పనిచేస్తున్న యూనిట్లపై ఎలాంటి చర్యలు లేవు. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ఎవరిది? ఆహార తనిఖీ అధికారులు ఈ విషయంపై సమాచారంకు వివరణ అడిగితే ఎక్కడెక్కడ కొత్త ఆర్ఒ ప్లాంట్లు స్థాపించారు. వివరాలు ఇవ్వాల్సిందిగా ప్రజాశక్తిని కోరడం వారి కర్తవ్య నిర్వహణ ఎలా ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకొని బహిరంగంగా కొనసాగుతున్న అక్రమ నీటి ప్లాంట్లను నిరోధించి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు. నిబంధనల ప్రకారం ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్, తాగునీటిని ఆహార పదార్థంగా ప్యాక్ చేయడానికి అనుమతి ఉండాలి. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, భూగర్భ జల వినియోగం పొందాలి. బిఐఎస్ సర్టిఫికేషన్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్రమాణాలకు బాటిల్స్‌పై లోగో, సర్టిఫికెట్ తీసుకోవాలి. గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అనుమతి, బోర్లు తవ్వి నీటిని వినియోగించడానికి ఎవరూ తీసుకోలేదు. అక్రమ బోర్లు పెరిగిపోతున్నాయి. శానిటేషన్ హైజీన్ సర్టిఫికేట్ నీటిని శుభ్రంగా నింపడానికి అనుమతి తీసుకోవాలి. చీరాల, వేటపాలెం, కొత్తపేట, అక్కయ్యపాలెం, దేశాయిపేట, చల్లారెడ్డిపాలెం, జబ్బర్ కాలనీ, వేటపాలెం ప్రధాన జంక్షన్ల వద్ద విపరీతంగా అక్రమ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

ఉల్లంఘించిన వారిపై చర్యలు

ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనని ఒంగోలు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులకు వెరవని వారిపై ఉక్కు పాదం మోపుతామని తెలిపారు.

సభలో మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మారెడ్డి

ఎంఎంసి మాజీ చైర్మన్ 'మద్దినేని'కి నివాళి

ప్రజాశక్తి - ఇంకొల్లు

పర్చూరు ఎఎంసి మాజీ చైర్మన్ మద్దినేని హనుమంత రావు రాజకీయాల్లో నిబద్ధత కలిగిన వ్యక్తని వైసిపి నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో మద్దినేని హనుమంతరావు సంస్మరణ సభ కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తనకు యువజన కాంగ్రెస్‌లో పనిచేసే నాటి నుండి మద్దినేని హనుమంతరావు పరిచయస్తులని గుర్తు చేసుకున్నారు. హనుమంతరావు మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డికి ప్రియ శిష్యునిగా, అత్యంత సన్నిహితులుగా, స్నేహితుడిగా మంచి గుర్తింపు ఉందని తెలిపారు. గాదె వెంకటరెడ్డితోపాటే రాజకీయాల్లో కొనసాగారని అన్నారు. అప్పటి, ఇప్పటి రాజకీయాలు వేరని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య మాట్లాడారు. హనుమంతరావు కుమారుడు సతీష్ కూతురు రజిని, కోడలు, అల్లుడు ఆధ్వర్యంలో మద్దినేనికి నివాళు లర్పించారు. ఇంకొల్లు రామచంద్ర ఏజెన్సీ ఎండి వల్లేటి రామారావు, హనుమంతరావుతో తనకున్న అనుబంధాన్ని తెలిపారు. మాజీ జెడ్పీటీసీలు, ఇంకొల్లు, పంగులూరు, మార్టూరు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ను ప్రదర్శిస్తున్న ఈగల్ టీం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

మత్తు పదార్థాలకు యువత బానిసలు కాకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఖైని, గుట్కా, పొగాకు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీం ఇన్చార్జ్ దుర్గాప్రసాద్ అన్నారు. మత్తు పదార్థాల వినియోగంపై యువత, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావడానికి స్థానిక కెఎస్ఆర్ హ్యాండ్లూమ్స్ వర్క్‌షాప్లో అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల నుంచి యువతను రక్షించడమే లక్ష్యమని అన్నారు. నేటి యువతలో మత్తు పదార్థాల వ్యసనం పెరిగిపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీ బి ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ఈగల్ టీం, శక్తి టీం కలిసి గంజాయి వద్దు బ్రో, మత్తు మీద యుద్ధం అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శక్తి యాప్, బాల్య వివాహాలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శక్తి టీం కానిస్టేబుల్ సుబ్బారావు మాట్లాడుతూ యువతులు, ఆడపిల్లలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 181, 1972, 1930, 1091 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో శక్తి టీం కానిస్టేబుల్స్ సునీత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నియోజకవర్గ కేంద్రం పర్చూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి మంత్రులు కొలుసు పార్థసారథి, ఆనం రామనారాయణ రెడ్డి పర్యటన ఖరారైనట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుతో కలిసి నూతలపాడులో పెన్షన్ పంపిణీ అనంతరం పోలేరమ్మ గుడివద్ద రూ.95 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభిస్తారని తెలిపారు. రూ.80 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పర్చూరులో నిర్మించిన టిటిడి కళ్యాణ మండపం ప్రారంభిస్తారని తెలిపారు.

సిఎం చంద్రబాబు నాయుడుతో ఎంపీ మాగుంట

సిఎంను కలిసిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, రాష్ట్ర విద్యా శాఖ నారా లోకేష్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి కలిశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో సిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన మాగుంట పలు విషయాల గురించి చర్చించారు.

మంత్రి స్వామికి పూల మొక్క అందజేస్తున్న ఎస్‌పి

మంత్రి స్వామిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని ప్రకాశం జిల్లా ఎస్‌పి వి. హర్షవర్ధన్ రాజు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమొక్క అందజేశారు.

సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కనిగిరి

సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ ఉక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 62 మంది లబ్ధిదారులకు రూ.41.32 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు వరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, మండల అధ్యక్షులు కొండ కష్ణారెడ్డి, టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు, బాలు ఓబుల్ రెడ్డి, మాలపాటి ఓబుల్ రెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, పిచ్చాల శ్రీనివాసరెడ్డి, గంగవరపు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎస్‌పురం : మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన షేక్ మమూలకు సిఎం సహాయనిధి నుంచి రూ.40వేల చెక్కుమంజూరైంది. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారురాలికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ యారవ రమా శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, గొర్రెల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, ఇండ్ల లక్ష్మణ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టాలు పట్టవా..?

- మూడు నెలలుగా వేతనాలు చెల్లించని వైనం
- ఇక్కట్లకు గురవుతున్న కార్మికులు

నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థలో కోవిడ్ సమయంలో నియమించిన పారిశుధ్య కార్మికుల కష్టాలు కార్పొరేషన్ అధికారుల కళ్లకు కనబడడం లేదు. గత నాలుగు నెలల నుంచి వారికి జీతాలు రాలేదు. అధికారులు, సంబంధిత సిబ్బంది పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.కార్మికులు ఇంటి ఖర్చులు, అద్దెలు, స్కూల్ ఫీజులు, ఇఎంఐలకు కోసం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తుంది.

బాధ్యతారహిత చర్యలు, నిర్లక్ష్య సమాధానాలు

నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో ఆప్కాస్ ద్వారా 650 మంది, కోవిడ్ సందర్భంగా 150 మంది అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్నారు. లెక్క ప్రకారం అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ ప్రతినెలా కార్మికులకు జీతాలు చెల్లించాలి. సంబంధిత పత్రాలు కార్పోరేషన్‌కు సమర్పించి ఆ తర్వాత బిల్లు తీసుకోవాలి. ఒంగోలు కార్పొరేషన్ లో అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య ఉన్న బలమైన బంధం కారణంగా ముందుగా జీతాలు ఇవ్వాల్సిన కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు ఉండవు. కాంట్రాక్టర్ చేయాల్సిన పనులు కూడా ఆఫీసులోని గుమస్తాలే చేస్తారు. కార్మికుల జీతాలు గురించి అడిగితే చులకనగా చూస్తూ వచ్చే దాకా ఆగలేరా? అంటూ నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. కార్మికుల చేత పని చేయించే విషయంలో పెత్తనం చేసే మిగతా అధికారులు జీతాలు సకాలంలో ఇప్పించేందుకు మాత్రం బాధ్యత వహించడం లేదు.పచ్చ పార్టీ యూనియన్ పెట్టి ఎమ్మెల్యే మెప్పు పొందే పనిలో పారిశుధ్య విభాగాధిపతి, నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా, ప్రభుత్వ విధానాల కారణంగా కార్మికులు నిరంతరం ఏదో ఒక సమస్య ఎదుర్కొంటున్నారు. వాటి పరిష్కారం కోసం సిఐటియు అనుబంధ యూనియన్ ద్వారా పోరాటం చేస్తున్నారు. గత 20 సంవత్సరాల నుంచి సిఐటియు అనుబంధ కార్మిక సంఘంలో కార్మికులు ఉన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో బాధ్యత వహించాల్సిన ఆ విభాగ అధిపతి అయిన అధికారి రాజకీయ నేతలా వ్యవహరిస్తూ, తెలుగుదేశం అనుబంధంగా యూనియన్ ఏర్పాటు చేస్తే అసలు ఏ బాధ ఉండదు. ఈ ధర్నాలు, గొడవలు ఉండవు అని కొందరి వద్ద ప్రస్తావించడం చూస్తే, ప్రభుత్వ అధికారా? లేక రాజకీయ పార్టీ నేతా? అన్న అనుమానం వ్యక్తం అవుతుంది. రాజకీయ సిఫార్సు ద్వారా ఉద్యోగం పొందిన తాను అధికార పార్టీ నాయకుల రుణాన్ని కార్మికుల మధ్య కుంపటి రాజేయడం ద్వారా తీర్చుకోవాలని అనుకుంటున్నట్లుగా కనబడుతుంది. గత వైసిపి పాలనలో ఆ పార్టీ నాయకులు కొందరు కార్మికు లను రెచ్చగొట్టి పోటీ యూనియన్ పెట్టి వారిని తమ అనుయాయులుగా ముద్రపడేటట్లు చేశారు. ఫలితంగా ప్రభుత్వం మారిన తర్వాత వారి ఉపాధికి పోవడానికి కారణమయ్యారని కార్మికుల శాపనార్థాలు గత పాలకులు ఎదుర్కొంటున్నారు. అలాంటి తప్పు మళ్ళీ చేసి ఎవరిని బలి చేయాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు?

ఎమ్మెల్యే, కమిషనర్ జోక్యం చేసుకొని గాడిలో పెట్టాలి

ఒంగోలు నగర అభివద్ధి తన మొదటి ప్రాధాన్యత అని చెబుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ నగరపాలక సంస్థలోని అన్ని విభాగాలను దగ్గర నుంచి పర్యవేక్షణ చేస్తున్నారు. అందులో భాగమైన మరియు ఎక్కువ మంది కార్మికులు పనిచేస్తున్న పారిశుధ్య విభాగం లోని లోపాలను సవరించి గాడిలో పెట్టాలి. నగరపాలక సంస్థ కమిషనర్ కూడా పరిపాలన, ప్రజల సౌకర్యాలు దష్టిలో ఉంచుకొని కార్మిక ప్రతినిధులు, అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి పదే పదే పునరావతం అవుతున్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కార మార్గాలు అన్వేషించి, ఆ పరిష్కారాల అమలు బాధ్యతలను నిర్దిష్టంగా సిబ్బందికి కేటాయించాలి.

లోతట్టు ప్రాంత ప్రజలు అధైర్య పడొద్దు

- జిల్లా యంత్రాంగం అండగా ఉంటుంది
- ట్రాక్టర్లు,బోట్లు అందుబాటు లో ఉండాలి
- పునరావాస కేంద్రాలలో అన్ని సౌకర్యాలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్



ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కృష్ణ నది పరివాహక లంకగ్రామాల ప్రజలు అధైర్య పడవద్దు జిల్లా యంత్రాంగం అండగా ఉందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి, భట్టిప్రోలు,కొల్లూరు,రేపల్లె మండలాల తహశీల్దార్లు,ఎంపిడిఒలు హెబిటేషన్, పునరావాస కేంద్రాల ఇన్‌ఛార్జులతో వరద ప్రవాహ పరిస్థితిపై మంగళవారం రాత్రి కలెక్టర్ బంగ్లా నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు లోతట్టు ప్రాంతాలు ప్రజలకు ధైర్యం చెప్పాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాక్టర్లు, బోట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలోని బాధితులకు అన్ని సౌకర్యాలు ఉండేలా ఇన్‌ఛార్జులు చూడాలన్నారు. వరద ఉధతి పెరిగితే ఎదుర్కొనడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో అంటువ్యాధులు ప్రబల ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. నీటి ప్రవాహం పరిస్థితిపై ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రీహెబిటేషన్లు కేంద్రాలకు కేటాయించిన అధికారులు, సిబ్బంది, రాత్రి పగలు అక్కడే ఉండాలన్నారు. నదిలో నీటి ప్రవాహం తగ్గే వరకూ జాగ్రత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సుదీర్ఘ కాలం విధులు నిర్వహించడం అభినందనీయం

ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ఎఎస్‌పి శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి- ఒంగోలుసబర్బన్

పోలీసు శాఖలో అంచెలు అంచెలుగా ఎదిగి వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన ఎఆర్ అడిషనల్ ఎఎస్‌పి కొల్లూరు శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కల్యాణ మండపంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో శ్రీనివాసరావును సన్మానించారు. జ్ఞాపికలను బహూకరించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ సుదీర్ఘంగా 34 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో విధులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పోలీసు ఉద్యోగానికి రిటైర్మెంట్ ఉన్నా, వ్యక్తిత్వానికిరిటైర్మెంట్ ఉండదన్నారు. పోలీసు ఉద్యోగంలో సేవలందించేందుకు సహాయ, సహకారాలు అందించిన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ తరపున ఎస్‌పి ధన్యవాదాలు తెలిపారు. శ్రీనివాసరావు తన ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ చూపి 127 రివార్డులు, 20 నగదు రివార్డులు, 17 ప్రశంసాపత్రాలు అందకున్నారు. మహోన్నతమైన ఆంధ్రప్రదేశ్ పోలీసు సేవా పతకం అందు కున్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ సిఐ దేవప్రభాకర్, ఒంగోలు తాలూకా సిఐ విజయకష్ణ, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, ఆర్‌ఐలు రమణ రెడ్డి, సీతారామి రెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.